

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





ఐదేళ్ల వైసీపీ పాలనలో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో అనేక అక్రమాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకురాలు రెడ్డెమ్మ అధ్యక్షతన పర్సన్ ఇన్‌చార్జ్‌లను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెకమెండేషన్‌తో నామినేట్ చేశారు. అప్పటి పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా రూ.కోట్లలో వైసీపీ నేతలకు రుణాలను మంజూరు చేసింది. వీటిని ప్రస్తావిస్తూ.. ఈ ఏడాది జూలై 11, 12 తేదీల్లో 'డీసీసీబీలో దారుణాలు, అక్రమాలకు సింగిల్ విండో' అనే శీర్షికలతో రెండ్రోజులపాటు ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా డీసీసీబీలో జరిగిన దారుణాలపై సీఎం చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. విచారణ జరిపి.. 15 రోజుల్లో నివేదిక అందించాలని డీసీవోను ఆదేశించింది.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

వైసీపీ పాలనలో జరిగిన దారుణాలపై సీఎంకు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఫిర్యాదు

సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

డీసీసీబీలో అక్రమాలపై విచారణ

ఫిర్యాదులో పేర్కొన్న వాటిలో కొన్ని..

గత పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా వి.కోటలో వైసీపీ నేతలు పీఎస్ నాగరాజుకు రూ.4లక్షలు, పీఎస్ మంజులకు రూ.39 లక్షలు, పీఎస్ లక్ష్మికి రూ.39 లక్షలు, పీఎస్ హరికుమార్‌కు రూ.40 లక్షలు, పీఎస్ మమతకు రూ.40లక్షల వంతున ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకు వ్యవసాయ రుణాలు ఇచ్చారు. హెడ్ ఆఫీస్‌లో రెడ్డి వీనస్, శైలేష్ చక్రవర్తిలకు తక్కువ వడ్డీతో వాహన రుణాలు మంజూరు చేశారు. బైరెడ్డిపల్లె తదితర బ్రాంచీల ద్వారా బోగస్ జేఎల్‌జీ సంఘాలకు బ్యాంకు మార్గదర్శకాలు పాటించకుండా అధిక మొత్తాల్లో రుణాలు ఇచ్చారు. నకిలీ సర్టిఫికెట్లతో ఒకరికి ఉద్యోగం ఇచ్చారన్న ఫిర్యాదురావడంతో ముందుగా తొలగించి, ఆ తర్వాత పాలకవర్గ పెద్దలు లంచాలు పొంది తిరిగి అరియర్స్‌తోసహా ఉద్యోగం ఇచ్చారు. అవసరానికి మించి అన్నిచోట్లా మెసెంజర్లను ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమించుకుని.. వారికి తక్కువ జీతాలిస్తూ ఆ మొత్తాలను పాలకవర్గ అధ్యక్ష, డైరెక్టర్లు, పీఏ స్వాహా చేశారు. వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు బ్రాంచీల్లో రైతుల పేరిట స్థానిక వైసీపీ నాయకులకు అక్రమంగా రుణాలిచ్చి బ్యాంకును భ్రష్టు పట్టించారు. పాలకవర్గ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా తమ బంధువులకు వివిధ రకాల రుణాలు మంజూరు చేశారు. బ్యాంకుతో ఏ మాత్రం సంబంధం లేని అప్పటి చైర్‌పర్సన్ రెడ్డెమ్మ భర్త కృష్ణమూర్తి అన్ని సమావేశాల్లో దర్జాగా కూర్చొని అధికార దుర్వినియోగం చేశారు. వరదయ్యపాళ్యంలో ఎస్‌హెచ్‌జీ పేరిట రూ.1.50 కోట్లు స్వాహా చేసిన సంఘటనపై ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. పుత్తూరు, నగరి, అన్నమయ్య, తిరుచానూరు బ్రాంచీల ద్వారా అప్పటి పాలకవర్గ సభ్యులు రాజకీయ ఉద్దేశంతో పెద్ద మొత్తాల్లో రుణాలు ఇప్పించారు. నగరి, బయ్యప్పగారిపల్లె, రొంపిచెర్ల పెట్రోల్ బంకు నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది.

వారంలోగా నివేదిక

డీసీసీబీలో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. పది రోజులుగా విచారిస్తున్నాం. ఆరోపణలు వచ్చిన హెడ్ ఆఫీస్‌తోసహా 12 బ్యాంకు బ్రాంచీల్లో సహకార శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. పూర్తి సమాచారం వచ్చాక మరో వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

- నాగవర్ధన, డీసీవో, చిత్తూరు

సీఎం జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి

నూతన డీఈవోగా వరలక్ష్మి బాధ్యతల స్వీకరణ



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని నూతన డీఈవో వరలక్ష్మి అన్నారు. అనంతపురం నుంచి చిత్తూరుకు బదిలీపై వచ్చిన ఆమె డీఈవోగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను డీఈవో కార్యాలయ సిబ్బందితోపాటు ఎస్టీయూ, యూటీఎఫ్, ఎన్‌టీఏ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా, అధికారులందరి సమన్వయంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. కాగా, ఈమె గతంలో చిత్తూరు డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్, ఏడీ1గా పనిచేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, అక్టోబరు 27: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

డిసెంబరు 1నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విధానం

- భూముల విలువ సవరణకు కసరత్తు
- 10-20 శాతం మేర ధరలు పెరిగే అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల విలువలను సవరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే డిసెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త విధానం అమలు చేయాలని ఆలోచిస్తోంది. నివాస, వాణిజ్య, పారిశ్రామిక, వ్యాపార, పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న ధరలు, మార్కెట్ విలువ తదితర అంశాలపై రిజిస్ట్రేషన్ శాఖ అధ్యయనం చేస్తోంది. ఇందుకు జేసీ విద్యాధరి ఆధ్వర్యంలో కమిటీలను గతంలోనే నియమించారు. ఏటా పట్టణ ప్రాంతాల్లో ఏడాదికోసారి, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోమారు భూముల విలువలను సవరిస్తుంటారు. 2022 జూన్‌లో వైసీపీ ప్రభుత్వం నిర్మాణాల విలువను భారీగా పెంచింది. తాటాకు, కొబ్బరాకు, రెల్లుగడ్డితో కప్పే గుడిసెలను సైతం వదల్లేదు.



వివరాలు సేకరిస్తున్నాం

భూముల విలువ సవరణకు మున్సిపల్, రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు తీసుకుంటున్నాం. మదింపు చేశాక వాస్తవ పరిస్థితికి అనుగుణంగా తుది నివేదిక రూపొందిస్తాం. ఎప్పటినుంచి ఇది అమల్లోకి వస్తుందో ప్రభుత్వం తెలియజేయలేదు. గతంలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చేది. పారదర్శకంగా ఉండాలనే దృక్పథంతో పక్కాగా కసరత్తు చేస్తున్నాం.

- మునిశంకరయ్య, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు.

కూటమి ప్రభుత్వం భూముల ధరల సవరణ పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టింది. డిసెంబరు నుంచి 10-20 శాతం మేర ధరలు పెంచే అవకాశం ఉంది.

అధ్యయన నివేదికే ప్రామాణికం

భూముల ధరల సవరణకు అధికారులు చేస్తున్న అధ్యయన నివేదికే ప్రామాణికం కానుంది. సబ్‌రిజిస్ట్రార్లు, అధికారులతో సమన్వయం చేసుకుని మార్కెట్‌లో ఉన్న భూముల విలువలను సేకరించి మదింపు చేస్తారు. దీని ఆధారంగా నివేదికకు తుది రూపం ఇస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మదింపు జరుగుతోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు.

కుప్పంలోని కమాండ్ కంట్రోల్ రూమ్



నేరాల నియంత్రణకు 'కమాండ్'

- కంట్రోల్ రూమ్ పరిధిలోకి కుప్పం డివిజన్

పోలీసులు ఎంత నిఘా ఉంచినా కుప్పం డివిజన్‌లో గ్రానైట్, బియ్యం, ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. దీనికితోడు గంజాయి రవాణా, వినియోగం కూడా ఎక్కువగానే ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో వీటిని అదుపు చేయడాన్ని పోలీసు అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలు, సూచనలతో కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు కమాండ్ కంట్రోల్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా వినియోగంలోకి తేవడానికి అవసరమైన ప్రణాళికలు రచిస్తున్నారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

కుప్పం నియోజకవర్గం మొత్తం ఒకే పోలీసు సర్కిల్ పరిధిలో ఉన్న సమయంలో సీఐ రాజశేఖర్ హయాంలో 2017లో ఏర్పాటు చేసిన ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. కుప్పం పట్టణంతోపాటు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. వాటిని ఈ రూమ్‌కు అనుసంధానం చేశారు. అప్పట్లో దొంగతనాలు, ట్రాఫిక్ వంటి సమస్యలు అదుపు చేయడం సాధ్యమైంది. ఆయన బదిలీపై వెళ్లాక ఈ వ్యవస్థ క్రమేణా బలహీనపడి.. వినియోగంలో లేకుండా పోయింది. కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు బాధ్యతలు స్వీకరించాక కమాండ్ కంట్రోల్ రూమ్ మళ్లీ కొంత వినియోగంలోకి వచ్చింది. గతంలో అమర్చిన సీసీ కెమెరాలు పాడైపోవడంతో, ఇటీవల పట్టణంలోని ప్రధాన కూడళ్లతోపాటు రద్దీ ఎక్కువగా ఉన్న ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, పూల మార్కెట్టు వంటి ప్రదేశాలలో మళ్లీ సీసీ కెమెరాలు అమర్చారు. వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఇటీవల కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం పోలీసు స్టేషన్లను ఎస్పీ మణికంఠ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కుప్పం రూరల్ సీఐ కార్యాలయం ఆవరణలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఈ వ్యవస్థను పటిష్ఠంగా వినియోగంలోకి తేవాలని డివిజన్‌లోని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. తగిన సూచనలూ ఇచ్చారు.

మల్లానూరులో చిన్న కమాండ్ కంట్రోల్ రూమ్!

నియోజకవర్గంలో ప్రస్తుతం కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలు ఉన్నాయి. ఇవి కాక మల్లానూరు, రాళ్లబూదుగూరులను మండలాలు చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కుప్పంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కేంద్రంగా చేసుకుని.. మల్లానూరులో మరో చిన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడమనే ఆలోచన ఇప్పుడు సాగుతోంది. అలాగే కేవలం కుప్పం పట్టణంలోని సీసీ కెమెరాల కన్నునే కాకుండా డివిజన్‌లోని నాలుగు మండలాలలో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కూడా కుప్పంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలన్న ఆలోచనా చేస్తున్నారు. దీనిపై సీఐ జీటీ నాయుడు మాట్లాడుతూ.. మల్లానూరులో సైతం ఒక చిన్నపాటి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఎస్పీ సూచనలతో పరిశీలిస్తున్నామని చెప్పారు.



డిజిటల్ తెర



కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

20కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

రామకుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ సర్కిల్ పరిధిలో ఆదివారం నిర్వహించిన విస్తృత దాడుల్లో 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్‌ఐలు నరేష్, శ్రీనివాసులు తమ సిబ్బందితో రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ముందస్తు సమాచారంతో దాడులు చేశారు. శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో చంద్రప్ప గంజాయి మొక్కలు, విక్రయాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. అలాగే రామకుప్పం మండలం గురుకులమడుగులో కేడా క్రిష్టన్ అనే వ్యక్తి గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్టు తేలింది. చంద్రప్ప ఇంట్లో తనిఖీ చేయగా ఐదు కిలోల గంజాయి మొక్కలను, క్రిష్టన్ ఇంట్లో 15కిలోల పచ్చి గంజాయి ఆకులు, 400గ్రాముల ఎండు ఆకులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు.



తగవులు తీర్చే రచ్చబండ

- 9లో

ఏ సమస్య వచ్చినా ఆ గ్రామంలోని రావి చెట్టు నీడన రచ్చబండ వద్ద కలుస్తారు. సామరస్యంగా పరిష్కరించుకుంటారు.

స్వామిని చూడగానే అన్నీ మరచిపోతా..!

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాటామంతీ

- 10లో



పంటలపై ఆగని గజదాడులు



పులిచెర్ల మండలం వైపు వస్తున్న ఏనుగుల గుంపు

- చాకిరేవు వంకలో మాటువేసిన ఏనుగుల గుంపు



ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పాళెం, పాతపేట, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. ముందుగా పాళెంలోని చలపతికి చెందిన అర ఎకరా వరి, సోమశేఖర్‌కు చెందిన అర ఎకరా టమోటా పంటను నాశనం చేశాయి. అక్కడినుంచి ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె సమీపానికి చేరుకుని నాగరాజుకు చెందిన అర ఎకరా వరిని తొక్కేశాయి. తర్వాత పాతపేట పంచాయతీ పూరేడువారిపల్లె వద్దకెళ్లి సత్యనారాయణకు చెందిన 50 అరటిచెట్లు, 10 కొబ్బరిచెట్లు, పశుగ్రాసం, వాసుకు చెందిన అర ఎకరా వరిని ధ్వంసం చేశాయి. కల్లూరులోని శ్రీనివాసులుకు చెందిన 5 మామిడిచెట్లు, రైతు మురళికి చెందిన 3 కొబ్బరిచెట్లను విరిచేశాయి. పాతపేట సమీపంలోని చాకిరేవు వంక వద్దకు చేరుకుని పగలంతా తిష్ఠ వేశాయి. ఈ ఏనుగుల గుంపును సదుం మండలం మీదుగా పలమనేరు కౌండిన్య అడవివైపు మళ్లించాలని ఎఫ్ఆర్‌వోలు థామస్ సుకుమార్, బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్‌వో షఫి, ఎఫ్‌బీవోలు మున్నా, శ్రీదేవి తమ సిబ్బందితో ప్రయత్నం చేశారు. అయితే సాయంత్రానికి మళ్లీ పులిచెర్ల మండలం వైపు అడుగుల వేశాయి. అటవీశాఖ అధికారులు టపాకాయలు కాల్చినా రాత్రి ఏడు గంటల సమయానికి కల్లూరు సమీపంలోని ఎద్దలవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. కల్లూరు సమీపానికి ఏనుగుల గుంపు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏదేమైనా ఈ రాత్రికి పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ విభాగంలోకి ఏనుగుల గుంపును రానీయకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి: పీసీసీఎఫ్

రామకుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల దాడుల పట్ల అటవీ అధికారులు, సిబ్బంది, ట్రాకర్లు (ఏనుగుల కదలికలను పరిశీలించే సిబ్బంది) అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) వైల్డ్‌లైఫ్ అజయ్‌కుమార్‌నాయక్ ఆదేశించారు. ఆదివారం అనంతపురం చీఫ్ కనకజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, చిత్తూరు డీఎఫ్‌వో భరణిలతో కలిసి రామకుప్పం మండలం ననియాలలోని కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. ఏనుగుల దాడులను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బంది, ట్రాకర్లకు దిశానిర్దేశం చేశారు. చిత్తూరు, అన్నమయ్య జల్లాల సరిహద్దుల్లో గజదాడులతో జరుగుతున్న పంట నష్టాన్ని పరిశీలించామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఈ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల మందను అడవిలోకి మళ్లించడానికి త్వరలోనే కుంకీలతో ఆపరేషన్ ప్రారంభిస్తామన్నారు. పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుంకీలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ అజయ్‌కుమార్‌నాయక్, సీసీఎఫ్ సెల్వం





మీ అభిమాన థియేటర్లలో
DEEPA ARTS 9908817549, 8125432278

మాదిగ ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): నవంబరు 4న తిరుపతిలో జరిగే ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని నరేంద్రబాబుమాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ ప్రజాభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

టీడీపీలోనే కార్యకర్తలకు గుర్తింపు

పుంగనూరు రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపుతోపాటు బీమా సౌకర్యం ఉన్నట్లు పుంగనూరు టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ. 5లక్షలు బీమా సౌకర్యం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ అబ్బాస్, సద్దాంహుసేన్, శ్రీనివాసులు, అస్లాం, రఫీక్, గౌస్, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.



మానవత సంస్థకు విరాళాలు



పుంగనూరు రూరల్: విరాళాల సేకరణలతోనే ప్రజా సంక్షేమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల ప్రజా భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వైకుంఠ రథం, ప్రీజర్ బాక్స్‌లు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గతంలో భవనం కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందని, ఆ స్థలంలో షెడ్ ఏర్పాటు చేసి వైకుంఠరథం, ప్రీజర్‌బాక్స్‌లు నిల్వ ఉంచుతామని వివరించారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందివ్వాలని ఆయన కోరారు. సంస్థ భవన నిర్మాణానికి రిటైర్డ్ లెక్చరర్ రెడ్డెప్ప రూ.10 వేలు, గంగవరం ఈవోఆర్డీ సుధాకర్ రావు రూ.10వేలు, బి.రామకృష్ణారెడ్డి రూ.5116 విరాళంగా అందజేశారు. సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య, ఏసీ నారాయణరెడ్డి, వెంకటముని, రామలింగారెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రావు, జగన్‌రెడ్డి, బార్గవ్, హరినాథ్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.





ఘనంగా రామమూర్తి విగ్రహావిష్కరణ



రామమూర్తి విగ్రహావిష్కరణలో కుటుంబసభ్యులు

పుంగనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో కాలేజీ వ్యవస్థాపకుడు ఎస్. రామమూర్తి విగ్రహాన్ని వారి కుటుంబసభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. ఆదివారం కాలేజీ ఆవరణలో ఆయన కుమారుడు సాయి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ శుభారాం ట్రస్ట్ ద్వారా విద్య, సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు.స్థలదాత రామమూర్తి సేవలను ప్రిన్సిపాల్ రాజశేఖర్ వక్తలు కొనియాడారు. ట్రస్ట్ సభ్యులు గోవింద రాజులు, ఎస్ఎం.ప్రకాశ్, జీఆర్. ప్రసాద్, ఎస్ఎం.మనోహర్, సౌమ్యఉమా, జి. రాజు, సౌమ్యసుధ ప్రకాష్, వాసవిప్రసాద్, స్మితామూర్తి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఆర్యవైశ్యులు, కాలేజీ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శీర్ కరుణీకర్ సంఘ అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే



ధ్యానమందిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో శీర్ కరుణీకర్ సంఘం అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పలమనేరు సమీపంలోని బోడిరెడ్డిపల్లి కాలనీలో శీర్ కరుణీకర్ సంఘం నిర్మించిన జ్యోతి రామలింగేశ్వర స్వామి ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీర్ కరుణీకర్ కులస్తులను బీసీలో చేర్చాలన్న డిమాండు ఎప్పటినుంచో వుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తన వంతు కృషి చేస్తానన్నారు. పలమనేరులో ధ్యానమందిరాన్ని ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సీవీ.శారద, శీర్‌కరుణీకర్ సంఘం నాయకులు సుబ్రమణ్యంపిళ్లై, సీవీ.కుమార్, సుధాకరపిళ్ళై, జయశంకర్, మురలీధర్, కిషోర్‌కుమార్, జ్యోతీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి జిల్లా స్థాయి పోటీలు



విజేతలతో జనవిజ్ఞాన వేదిక నాయకులు

పలమనేరు, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ పోటీలు ఆదివారం పలమనేరు బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి 25 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి చిత్తూరు పీసీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆకాష్, యోషిత, యశ్వంత్, ప్రైవేటు పాఠశాలల విభాగం నుంచి చిత్తూరు విజయం పాఠశాల విద్యార్థులు సుహనాహ్, పరిణితి, భార్గవ్ ఎంపికయ్యారు. వీరికి సర్టిఫికెట్లు, మెడల్స్, ఫైల్స్, పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గిరిధర్, ప్రధానకార్యదర్శి బాలచైతన్య, పలమనేరు, గంగవరం ఎంఈవోలు బాలసుందరం, వేణుగోపాల్ రెడ్డి, గౌరవాధ్యక్షులు శ్రీపురం సీతారామయ్య, జిల్లా కోశాధికారి సుదర్శనాచారి, రాష్ట్రకౌన్సిలర్ నాగేశ్వరరావు, సభ్యులు పీసీబాబు, చిరంజీవి, అరుణ్, సుధాకర్, షంషేర్‌ఖాన్ పాల్గొన్నారు.





చిత్తూరులో 'జోస్ ఆలుక్కాస్' ప్రారంభం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పలమనేరు రోడ్డు రెడ్‌క్రాస్ బిల్డింగ్ ఎదురుగా జోస్ ఆలుక్కాస్ నూతన జ్యువెలరీ షోరూమ్‌ను ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్‌తో కలిసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తూరును విద్య, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ నాణ్యమైన నగలకు కేరాఫ్ అడ్రస్ 'జోస్ ఆలుక్కాస్' అన్నారు. ఎండీలు వర్గీస్, పాల్‌జే, జాన్ ఆలుక్కాస్ మాట్లాడుతూ.. చిత్తూరులో తమ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. షోరూమ్ ప్రారంభం సందర్భంగా వినియోగదారులకు పలు రాయితీలు, పథకాలు ప్రవేశ పెట్టామని తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐశ్వర్య రాజేష్, పక్కన ఎమ్మెల్యే జగన్మోహన్, షోరూమ్ నిర్వాహకులు

తగవులు తీర్చే బేలుపల్లె రచ్చబండ

బైరెడ్డిపల్లె మండలంలోని బేలుపల్లె గ్రామంలో ఉన్న రచ్చబండకు తగవులు తీర్చే బండగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇంతే కాకుండా గ్రామంలో ఎవరింట్లో పెళ్లి జరిగినా రచ్చబండ దగ్గర నలుగుపెట్టి వివాహ కార్యక్రమాలు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. చాలావరకు గ్రామంలో ఏ సమస్య వచ్చినా ఈ రచ్చబండ వద్ద కూర్చొని పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవడం జరుగుతోంది. రావి చెట్టు నీడన విశ్రాంతి తీసుకోవడానికే కాకుండా సమస్యల పరిష్కార వేదికగా ఈ రచ్చబండ గుర్తింపు పొందడం విశేషం. దుస్థితికి చేరుకున్న రచ్చబండను ఇటీవల బేలుపల్లెకు చెందిన నంగిలి కృష్ణవేణమ్మ, లక్ష్మమ్మ, రామయ్యమొదలి కుటుంబీకులు పునర్నిర్మాణం చేసి గ్రానైట్ బండలు పరిచి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు.

- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి


బేలుపల్లెలో వున్న రచ్చబండపై కూర్చొని ఉన్న గ్రామస్తులు

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, అమ్మవారి దర్శనం కోసం వేచి వున్న భక్తులు

చౌడేపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆదివారం ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వర్ణాభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

భక్తులపై టెండరుదారుల దాడి

బోయకొండ ఈవో జోక్యంతో సద్దుమణిగిన వివాదం

చౌడేపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో భక్తులపై క్లీనింగ్ టెండరుదారుల అనుచరులు దాడులు చేసి గాయపరచిన ఘటన ఆదివారం జరిగింది. బాధితుల కథనం మేరకు ... అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన సురేష్‌రెడ్డి ఆర్మీలో పని చేస్తున్నారు. గంగమ్మ మొక్కు నిమిత్తం ఆయన తన బంధుమిత్రులతో కలిసి ఆదివారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. మొక్కుబడిగా అమ్మవారికి పొట్టేలును బలి సమర్పణ చేశారు. ఈ తర్వాత క్లీనింగ్ కోసం టెండరుదారుల నుంచి రూ.400 చెల్లించి రసీదు తీసుకున్నారు. అయితే అదనంగా మరో రూ.200ఇవ్వాలని టెండరుదారులు డిమాండ్ చేయడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సురేష్‌రెడ్డి బంధువులు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన వారికి కొండకింద ఉన్న ఆలయ ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్సలు అందించారు. బాధితులు ఈ విషయమై ఈవో ఏకాంబరానికి తెలపగా ఆయన ప్రథమ చికిత్స కేంద్రం వద్దకు చేరుకుని ఇరువర్గాలను విచారించి గాయపడిన వారికి టెండరుదారుల నుంచి రూ.50వేలు నష్టపరిహారం తీసిచ్చారు. ఇంతటితో ఈ విషయం సద్దుమణిగింది. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇలాంటి విషయాలతో బోయకొండ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందని భక్తులు కోరుతున్నారు.


భక్తులతో మాట్లాడుతున్న ఈవో ఏకాంబరం

పశువుల పాకగా చౌడేపల్లె ఆర్టీసీ బస్టాండ్



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్, పశువులను కట్టేసిన దృశ్యం

చౌడేపల్లె, అక్టోబర్ 27: చౌడేపల్లెలోని ఆర్టీసీ బస్టాండ్ పశువుల పాకగా మారింది. చౌడేపల్లెలో 15ఏళ్ల క్రితం రూ.50లక్షల వ్యయంతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. నిర్మించినప్పటి నుంచి నిరుపయోగంగా మారింది. దీంతో సమీపంలో నివాసాలున్నవారు పశువుల కట్టేసుకుంటూ పశువుల పాకగా మార్చేసారు. మరికొందరు వేస్టేజ్, మరికొందరు పొట్టు బస్తాలను వేయడంతో గోడౌన్‌లా మారింది. సాయంత్రం అయితే జనసంచారం లేకపోవటంతో మందు బాబులకు అడ్డగా మారుతోంది. అధికారులు స్పందించి బస్టాండును ఉపయోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ మైనార్టీ ఐటీఐని పట్టించుకోండి

సాంకేతిక కోర్సులున్నా బోధకులు కరువు ● నిరుపయోగంగా విలువైన పరికరాలు ● సీట్లన్నీ విద్యార్థులతో ఫుల్ ..శిక్షణ మాత్రం నిల్




పుంగనూరు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ, నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు, ఫ్యాషన్ డిజైన్ యంత్రాలు

పుంగనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు సాంకేతిక రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన దోహదపడేలా పుంగనూరులో ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేసినా పలు సమస్యలతో ప్రభుత్వ ఆశయం నెరవేరలేదు. 1998లో ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ మంజూరు కాగా స్థానిక పలమనేరు రోడ్డులోని గూడూరుపల్లె వద్ద 2010లో రూ.62.50లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించగా నాటి అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఐటీఐలో మెకానిక్ డీజల్ కోర్సులో 24 మంది, వెల్డర్‌లో 20 మంది, ఫ్యాషన్ డిజైన్స్ టెక్నాలజీలో రెండు యూనిట్లకు 40 మంది, రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషన్ కోర్సులో 20మంది, ఫిట్టర్‌లో 20 మంది, డ్రాఫ్ట్స్‌మెన్స్ సివిల్‌లో 24మంది, మోటర్ మెకానికల్ (ఎంఎంవీ)లో 20 మంది శిక్షణ పొందేలా ప్రభుత్వం సీట్లు మంజూరు చేసింది. పదోతరగతి, టెన్త్ ఫెయిల్, ఇంటర్మీడియట్ అర్హతతో సీట్లు కేటాయిస్తుండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఐటీఐలో విద్యార్థులు మాత్రం అడ్మిషన్లు పొందుతున్నారు కానీ ఇక్కడ అధ్యాపకులులేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులకు 30కంప్యూటర్లు ఏర్పాటు చేసినా ఫ్యాకల్టీ లేక కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. కాలేజీ ప్రారంభంలో మంజూరైన పోస్టులు తప్ప కొత్త పోస్టులు మంజూరు కాలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఐటీఐలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. 2022 అక్టోబరు 21న నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్కిల్ హబ్‌ను ప్రారంభిం చారు. కానీ ఏడాది మాత్రమే స్కిల్ హబ్ నడిచి తర్వాత దాని ఊసేలేదు. కుట్టు మిషన్లు ఇస్తామని ప్రకటించడంతో అప్పట్లో అధిక సంఖ్యలో ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ కోర్సులో మహిళలు శిక్షణ పొందినా ప్రభుత్వం మెషీన్లు ఇవ్వలేదు. అన్ని విభాగాల్లో విలువైన పరికరాలున్నా ఫ్యాకల్టీ లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. డీజిల్ మెకానిక్‌లో పనిచేసే అధ్యాపకుడు రెండేళ్ల క్రితం, ఫిట్టర్‌లో ఓ అధ్యాపకుడు ఈ ఏడాది చనిపోగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీలో ఇద్దరు అధ్యాప కులే ఉన్నారు. దాదాపు రెండేళ్లుగా ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పుంగనూరు, తంబళ్లపల్లె కాలేజీలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గా వ్యవహరిస్తున్నారు. కాలేజీలో నలుగురు సీనియర్ అసిస్టెంట్లకుగానూ ఒక్కరే ఉండగా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐదుగురు డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్లకు నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు, వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఐటీఐ కాలేజీ సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపానని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కాలేజీ పట్టణానికి దూరంగా ఉండగా ప్రహరీలేదు. తాగునీటి సమస్యతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతూ ట్యాంకుల ద్వారా నీరు కొనుగోలు చేస్తున్నారు.ప్రభుత్వం స్పందించి పుంగ నూరుల మైనార్టీ ఐటీఐ కాలేజీలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డున్నా బస్సుకు నోచుకోని బూరగమంద

సదుం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ అయిన బూరగమందకు గతేడాది డబుల్‌రోడ్డు నిర్మించారు. కానీ బస్సు సర్వీసు లేక డబుల్ రోడ్డు ఉండి కూడా లాభం లేదని స్థానికులు వాపోతున్నారు. బూరగమంద పంచాయతీ పరిధిలో సుమారు 20 గ్రామాలు న్నాయి. మండల కేంద్రమైన సదుం నుంచి బూరగమందకు కేవలం మూడు కిలోమీటర్లే అయినా దాని పరిధిలోని పల్లెలు సుమారు పది కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. డబుల్ రోడ్డు వేయకముందు ప్రతిరోజూ నాలుగు ఆర్టీసీ సర్వీసులు తిరుగుతుండేవి. సదుం-కల్లూరు ప్రధాన రహదారిలోని బూరగమంద క్రాస్ నుంచి బూరగమంద, చీకలచేను మీదుగా నాయన పాకాల ప్రాంతానికి ఈ డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అలాగే బూరగమంద క్రాస్ నుంచి రామాపురం మీదుగా ఎర్రాతివారిపల్లె అయ్యప్ప స్వామి ఆలయానికి డబుల్ రోడ్డు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. డబుల్ రోడ్డు కనెక్టివిటీతో బూరగమందకు ఆర్టీసీ బస్సు సర్వీసు కొన్ని నెలల క్రితమే రద్దు అయ్యింది. దీంతో రైతన్నలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లెవెలుగు బస్సులు కూడా బూరగమంద క్రాస్ వద్ద స్టాపింగ్ లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజల్ని మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


సదుం-కల్లూరు రహదారిలో ఉన్న బూరగమంద క్రాస్ రోడ్డు

కార్డుదారులకు కందిపప్పు వచ్చేసింది

ఈసారి నుంచి జొన్నలు కూడా పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు నవంబరు నుంచి బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలను పంపిణీ చేయనున్నారు. అన్ని కార్డులపై కిలో రూ.67 చొప్పున కందిపప్పు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు పంచదార కిలో రూ.14, మిగిలినవారికి అర కిలో రూ.17 చొప్పున అందించనున్నారు. ప్రతి కార్డుదారుడికీ మూడు కిలోల చొప్పున బియ్యం బదులు జొన్నలు పంపిణీ చేయనున్నారు. జిల్లాకు నవంబరు నెలకు సంబంధించి 8,400 టన్నుల బియ్యం, 540 టన్నుల కందిపప్పు, 300 టన్నులు పంచదార, 300 టన్నుల జొన్నలు కేటాయింపులు జరిగాయని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ఇప్పటికే 90శాతం సరుకులను చౌకదుకాణాలకు తరలించామన్నారు. ఈనెల 31లోపు అన్ని దుకాణాలకు సరుకులు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అడవి పంది మృతి ఘటనలో ఒకరి అరెస్టు

తవణంపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల ఉచ్చులోపడి అడవి పంది మృతి చెందిన ఘటనలో ఒకరిని ఆదివారం అరెస్టు చేసినట్లు అటవీ శాఖ డీఆర్‌వో ఆనందరెడ్డి తెలిపారు. తవణంపల్లె మండలంలోని మారేడుపల్లె గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందుల వేట కోసం కరెంటు తీగలతో ఉచ్చు ఏర్పాటు చేశారు. ఇందులో చిక్కుకుని శనివారం వేకువ జామున అడవి పంది మృతి చెందింది. దీనిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనికి కారకుడైన దిగువమారేడుపల్లెకు చెందిన సురేంద్ర(45)ను అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, అక్టోబరు 27: కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలనుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి, ఆయా ప్రభుత్వ విభాగాధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాణిపాకంలో ముగిసిన ఖోఖో పోటీలు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో.. ప్రకాశం జట్టు ప్రథమ స్థానం, కృష్ణా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో.. ప్రథమస్థానంలో ఈస్టు గోదావరి, ద్వితీయస్థానంలో శ్రీకాకుళం జట్లు నిలిచాయి. ముగింపు సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ.. ఖోఖో చాంపియన్ షిప్ పోటీలను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ కాణిపాకంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, గిరిధర్‌బాబు, శాప్ చైర్మన్ రవి నాయుడు, మణి నాయుడు, హరిబాబు నాయుడు, మధుసూదన్‌రావు, లత తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ తెలిపితే ఐదేళ్ల జైలు శిక్ష

ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ శిరీష

పలమనేరు, అక్టోబరు27 : లింగనిర్ధారణ తెలిపితే చట్టరీత్యా 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తారని ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష అన్నారు. ఆదివారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పలమనేరు సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు కోసం బాలికల దృష్టి అనేఈ సంవత్సరం బాలికా దినోత్సవం థీమ్‌తో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, లింగ అసమానతత్వం, బాల్యవివాహాలు, విద్య, ఆరోగ్య హక్కులు సాధించడం అనేవి నేటి బాలికా దినోత్సవ లక్ష్యం అన్నారు. లింగవివక్షత లేకుండా చూడడం అవసరమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రశాంతి, డాక్టర్ ఆశ, ఎంఈఓ బాలసుందరం, డెమో ఇన్‌ఛార్జి రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. వైద్యఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి జయశంకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవి, నజ్మా, ఉషారాణి, సామాజిక కార్యకర్త లావణ్య, మహిళాపోలీసు జ్యోతి, ఉపాధ్యాయులు,విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ శిరీష

సంస్కృతి, సంప్రదాయాల వికాసానికి కృషి



పద్యాల పోటీల్లో గెలుపొంది జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులు, పురస్కారాన్ని అందుకున్న ఉపాధ్యాయులు, కవులు

గంగవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మన తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాల వికాసానికి ప్రతిఒక్కరూ కలసికట్టుగా కృషిచేయాలని ఆచార్య కిరణ్‌క్రాంత్ చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కళామందిరంలో నిర్వహించిన తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి పుష్కరోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి కంప్యూటర్ యుగంలో సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్న తరుణంలో మన తెలుగు పండుగలు, సాహిత్యం, సంప్రదాయాల పరిరక్షణకు పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు ఉచితంగా అందించి, విద్యార్థుల్లో విలువలు పెంచడానికి తులసీ నాథం దంపతులు చేస్తున్న కృషిని కొనియాడారు. శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ పిల్లలకు సంపదను అందించడం కంటే సంస్కారాన్ని అలవరచడం కోసం తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు పద్యాలు, కథలు, సాహిత్యం, సంస్కృతి నేర్పించినట్లయితే విలువలు, మేధాశక్తి పెంపొంది సులభంగా ఉన్నత స్థాయికి చేరడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం జాతీయస్థాయి పద్యాల పోటీలలో వందకు పైగా పద్యాలు చెప్పిన 62మంది పిల్లలకు బహుమతులు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. అలాగే తెలుగుసాహిత్య సమితి పుష్కరోత్సవ పురస్కారాలను కె.శ్రీధర్ బాబు, శివకుమారి, ప్రశాంతి, రూపాదేవి, పద్మజ, గంగాధరం, ఖిజర్‌ఖాన్, యాసిన్ షరీఫ్, రెడ్డెమ్మ , షబానా, అనిత , మిట్టాలక్ష్మిలకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప, ప్రకాష్‌రెడ్డి, పలమనేరు బాలాజి, మాధవ్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలసుందరం, మురళి, రేణుక, జొన్నవిత్తుల దాము, ధనంజయ, భేరివాణి, బుజ్జమ్మ, విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
Wanted Tele Callers/Marketing Officers / Team Leaders, Salary Rs. 20,000/- pm + Incentives upto Rs.25,000/-, RKC Group: 8801501376, 8801502343.
AJT - 4404

CHANGE OF NAME
I, D. Thulasi Rani Spouse of late K. Neerajakshulu Naidu Rank Naik No: 6378058N Resident of D. No 6-94,Rajakula colony, Pudipatla Village & Post Tirupati Rural, Tirupati Dt, Andhra Pradesh, India have changed my name from TULSI RANI (Old Name) to D.THULASI RANI (New Name) D.O.B 16-05-1975, That both names pertain to one and the same person.
AJT - 4433

WANTED
Telesales Persons from Tirupati, Females work from home,willing to work hard required for a Temporary Project. Contact : 85009 60577
AJT - 4422

PLOTS FOR SALE
36 months EMI Plots for Sale. Near Yerpedu IIT, IISER & IT Hub, Final Approved & Spot Registration. RKC Developers : 88015 01376.
AJT - 4405

WANTED
బోత్ హాస్పిటల్, కొర్లగుంట, తిరుపతి నందు పనిచేయుటకు వార్డు బాయ్స్ కావలెను. నైట్ డ్యూటీ సెక్యూరిటీ గార్డ్స్, వంట మనిషి (ఆడ) కావలెను. సెల్ : 99494 23941, 81254 62933.
AJT - 4431

PLOTS FOR SALE
రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీకి ఎదురుగా దాలర్స్ 15 లో 122 (55 అంకణాలు) ఈస్ట్ ఫేసింగ్, తుడా అప్రూవల్ గల ప్లాట్ అమ్మబడును. 1 అంకణం 78000 రూ మాత్రమే . సెల్: 99660 66111
AJT - 4426

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198455

PLOTS FOR SALE
తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర TCL కంపెనీకి ఎదురుగా తక్కువ బడ్జెట్‌లో తుడా ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ అందుబాటులో కలవు. 82470 75857, 94943 92069
AJT - 4429

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పరదాలతో సరి



మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీ కూలి ఏడాదైంది. అప్పట్నుంచి ఇలా గోనెసంచులు, పరదాలు కట్టి సరిపెట్టారు. ఇక్కడ 2013లో మినీ ఆర్టీసీ డిపో, గ్యారేజీ నిర్మించారు. కాశిరాయితో ప్రహరీ నిర్మించారు. కొండ నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహానికి గోడ పునాదుల వరకు మట్టి కొట్టుకుపోయింది. గతేడాది భారీ వర్షానికి మెకానిక్ సెక్షన్ వెనుక వైపు గోడ కూలింది. అప్పట్లో సిబ్బంది తాత్కాలికంగా పరదాలు, గోనె సంచులు కట్టారు. రేకులు అడ్డుగా పెట్టారు. ఇలా.. ఏడాదిగా సరిపెట్టేశారు. రాత్రిపూట ఎలుకలు, పాములు వస్తున్నాయని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

రోడ్లపైనే పార్కింగ్

నిత్యం రద్దీగా ఉండే తిరుమల బైపాస్ రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. లీలామహల్ కూడలి నుంచి ప్రకాశం పార్కు వరకు రోడ్డుకు రెండువైపులా కార్లు, ఆటోలు, మినీ బస్సులు బారులు తీరుతున్నాయి. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

- తిరుపతి (లీలామహల్), ఆంధ్రజ్యోతి



స్వామిని చూడగానే అన్నీ మరచిపోతా..!

'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాటామంతీ

ఇంటర్వ్యూ



'స్వామిని ఏవేవో కోరుకోవాలని లిస్ట్ పెట్టుకుని వెళ్తా. తీరా ఆయన్ను చూడగానే అన్నీ మర్చిపోతా. ఏమీ కోరుకోను. నువ్వు ఇచ్చినవాటికి సంతోషంగా ఉన్నాను.. ఇంకా ఇస్తే ఆనందంగా తీసుకుంటా.. స్వామి ఆశీర్వాదముంటే చాలనుకుంటా. స్వామిని దర్శించుకుంటే ఒక పాజిటివ్ వైబ్రేషన్ వస్తుంది' అని సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అన్నారు. పలు తమిళ సినిమాల్లో కథానాయికగా రాణిస్తున్న ఈమె తెలుగులో 'టక్ జగదీష్'లో మరదలుగా, 'కౌసల్య కృష్ణమూర్తి'లో కూతురిగా, 'వరల్డ్ ఫేమస్ లవర్'లో భార్యగా, 'రిపబ్లిక్'లో ఎన్ఆర్ఐగా.. ఇలా పలు సినిమాలతో ప్రేక్షకుల్లో ముద్ర వేసుకున్నారు. తిరుమలేశుడిని దర్శించుకున్న ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నాలుగేళ్లు తిరుపతిలోనే చదివా

తిరుపతితో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నాన్న రాజేష్ హీరో, అమ్మ కొరియోగ్రాఫర్. అమ్మ, మోహన్‌బాబు గారు మంచి స్నేహితులు. దీంతో మా అన్నలతో కలిసి ఇక్కడే శ్రీవిద్యానికేతన్‌లో నాలుగో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు చదువుకున్నా. సెలవుల్లొస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపేది తిరుమలలోనే. ఇప్పుడంటే వీఐపీ బ్రేక్ దర్శనం. చిన్నప్పుడు దర్శనానికి ఎనిమిది గంటల పాటు క్యూలైన్లలో నిలబడేదాన్ని. అన్ని గంటల పాటు వేచి స్వామిని చూడగానే అద్భుతమైన వైబ్రేషన్స్ వస్తాయి. మా అత్త శ్రీలక్ష్మితో (హాస్య నటి) మొదటిసారి వచ్చి స్వామిని దర్శించుకున్నా.

దీపం వెలిగించాకే అడుగు బయటకు

నన్ను వీఐపీ బ్రేక్ దర్శనం స్థితికి తీసుకొచ్చింది స్వావేనని నమ్ముతాను. పెద్ద భక్తురాలిని కానుగానీ షూటింగ్ సమయాల్లోనూ సమీపంలోని ఆలయాలకు వెళ్తుంటాను. దీపం వెలిగించకుండా బయటకు వెళ్లను. తిరుమల చాలా ఇష్టం. దర్శించుకున్నప్పుడల్లా రెండు మూడు కోరికలు చెప్పు కోవాలనుకుంటాను. స్వామి దగ్గరికి వెళ్లగానే ఒక ట్రాన్స్‌లో ఉండిపోతాను.

స్వామి అనుగ్రహం ఉంటేనే రాగలం

స్వామి అనుగ్రహం ఉంటేనే ఇక్కడికి రాగలమని నమ్ముతాను. చిత్తూరులో కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో స్వామిని దర్శించుకోవాలనుకున్నా. హైదరాబాద్‌లో షూటింగ్ ఉండటంతో దర్శనానికి వెళ్లలేనేమో అనుకున్నా. అనుకోకుండా షూటింగ్ రద్దయింది. చిత్తూరులో కార్యక్రమానికి ముందురోజే వచ్చి స్వామిని దర్శించున్నాను.

పదేళ్లలో చూడని పాత్రలో నటిస్తున్నా

నాది తెలుగులో చివరి సినిమా 'రిపబ్లిక్'. మంచి సినిమా కోసం రెండేళ్ల పాటు వెయిట్ చేశా. తెలుగు సినిమాల కథలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అది చాలా మంచి పాత్ర. గత పదేళ్లలో తెలుగు సినిమాల్లో ఇలాంటి పాత్ర అనేది లేదు. చాలా ఇష్టపడి చేస్తున్నా. గోదావరి అమ్మాయి క్యారెక్టర్. ఎక్కువ భాషలు రావడంలో ఇండస్ట్రీలో కంపర్టబుల్‌గానే ఉంది.

ఈ జనరేషన్ చాలా స్మార్ట్

ఇప్పటి అమ్మాయిలు చాలా స్మార్ట్. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వీడియోలతో అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. సరిగా వినియోగించుకుంటే మంచి అవకాశాలొస్తాయి. సోషల్ మీడియా పవర్‌ఫుల్ కదా. రీల్స్ బాగా చేస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు. ఇటీవల ప్రభాస్ సినిమాలో కూడా ఓ అమ్మాయి హీరోయిన్‌గా ఇలాగే ఎంట్రీ ఇచ్చింది. పదేళ్ల ముందంటే ఓ ఫొటో పట్టుకుని అవకాశాల కోసం తిరిగేవాళ్లం. అందుకే ఈతరం వాళ్లు అదృష్టవంతులంటాను.





యంత్రానికి పూజలు చేస్తున్న శంకర విజయేంద్ర - యాత్రను ప్రారంభిస్తున్న శంకర విజయేంద్ర, జేఈవో వీరబ్రహ్మం

శ్రీరామమంత్ర యంత్ర యాత్ర ప్రారంభం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ మంత్ర యంత్ర యాత్ర ఆదివారం తిరుపతిలో ప్రారంభమైంది. వినాయకనగర్‌లోని కంచి మఠం వద్ద కంచి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర ఆ యంత్రానికి పూజలు నిర్వహించి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి యాత్రను ప్రారంభించారు. విజయేంద్ర మాట్లాడుతూ కంచి ఆలయంలోని శ్రీరామమంత్ర యంత్రాన్ని పోలిన యంత్రాన్ని బంగారంతో తయారు చేయించి అయోధ్య ఆలయంలో యాగపూజలో ఉంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఈ మహామంత్ర యంత్రం ప్రత్యేక వాహనంలో బయలుదేరిందని, ఐదు రాష్ట్రాల మీదుగా 2వేల కిలోమీటర్లు ప్రయాణించి నవంబరు 17వ తేదీన అయోధ్య చేరుకుంటుందని వివరించారు. నవంబర్ 18 నుంచి 2025 జనవరి ఒకటి వరకు అయోధ్యలో లక్ష చండీ విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తామని తెలిపారు. శ్రీరాముడు జన్మించిన అయోధ్యకూ, కంచికీ పురాతన కాలం నుంచి సంబంధముందని, రాముల వారి జననం కోసం దశరథుడు కంచికి వచ్చి, వారం రోజులు అమ్మవారిని ప్రార్థించాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అయోధ్యలో నిర్మించిన బాలరామాలయం వృద్ధిలోకి రావడానికి కంచి మఠం భక్తులు కృషి చేస్తున్నారని తెలిపారు. తిరుమల తరహాలో అయోధ్యలోనూ ధర్మం, దానం, తపస్సు వంటి హైందవ ధర్మ విధులు మరింత పటిష్ఠంగా నిర్వహించడానికి కంచి మఠం కృషి చేస్తోందన్నారు. తిరుపతి కంచి మఠం కేంద్రంలో ఆదివారం నుంచి ఆయుర్వేద చికిత్స కేంద్రం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఇది ఎవరి పని?

- తిరుపతిని టార్గెట్ చేసింది ఎందుకు?
- వరసగా బాంబు బెదిరింపు ఈ మెయిల్స్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లు, రెండు ఆలయాలు, రేణిగుంట విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తీర్థకట్టవీధి ప్రాంతాలకు బెదిరింపులు తప్పలేదు. ఇదంతా ఎవరు చేస్తున్నారు? తిరుపతినే ఎందుకు టార్గెట్‌గా చేసుకున్నారనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు రేణిగుంట విమానాశ్రయానికి ఈ వారం రోజుల్లోనే మూడు సార్లు ఇదే రకం మెయిల్స్ వచ్చాయి. విమానాలనూ వదల్లేదు. ఇక, నాలుగు రోజుల నుంచీ తిరుపతిలోని హోటళ్ళకు వరుస బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీంతో బెదిరింపు మెయిల్స్ వస్తుండడంతో పోలీసులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడం.. తిరుపతిలో ఏం జరిగినా దేశవ్యాప్తంగా తెలిసే అవకాశం ఉండటంతో నగరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. 'తమిళనాడులో టెర్రరిస్టు జాఫర్ సాదిక్‌కు జైలు శిక్ష పడటానికి ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ సహకారం అందించడం మాకు నచ్చలేదు. ఆ రాష్ట్రంతో పాటు తమిళనాడుకు దగ్గరగా ఉన్న పుణ్యక్షేత్రమైన తిరుపతిలోని పలు హోటళ్లను కూడా పేల్చేస్తాం' అని మెయిల్‌లో దుండగులు పేర్కొన్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ తరహా మెయిల్స్‌పై లోతుగా, సమగ్రంగా దర్యాప్తు చేసే సంస్థలు, వ్యవస్థలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీంతో బెదిరింపు మెయిల్స్ వచ్చినప్పుడు హడావుడిగా ఘటనా స్థలాలకు వెళ్లడం, తనిఖీలు చేయడం వరకే పరిమితం అయ్యే పరిస్థితి ఉంది.

ఏర్పేడులో మూడు కేసులు నమోదు

రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్‌పై ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు, సీఐఎస్ఎఫ్ దళాలు .. రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన మెయిల్స్, బెంగళూరుకు వచ్చిన మెయిల్ ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం. కోల్‌కత్తాలోని మిత్రా అనే వ్యక్తి ఇలాంటి ఫేక్ మెయిల్స్ వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత.. ఇక్కడి పోలీసులూ బెంగళూరు వెళ్లి మెయిల్స్‌ను క్రాస్ చెక్ చేసుకుని రెండూ ఒకే తరహాలో ఉంటే అతడిని పీటీ వారెంట్‌పై తిరుపతికి తీసుకురానున్నారు. ఈ మేరకు ఓ పోలీసు అధికారి చెప్పారు.

ప్రభుత్వ భూమికి కంచె



గతంలో చదును చేసిన ప్రభుత్వ భూమికి వేసిన కంచె

వడమాలపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం బాలినాయుడు కండ్రిగ పంచాయతీలోని బంగారెడ్డి కండ్రిగ ఎస్టీ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. సుమారు నాలుగు ఎకరాలను చదును చేసి ఏకంగా కంచె వేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 100 ఎకరాలకు పైగా గుట్ట పోరంబోకు భూములను చదును చేయడాన్ని ఎస్టీ కాలనీవాసులు అడ్డుకున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఫిబ్రవరి 8న 'గుట్ట పోరంబోకును ఆక్రమిస్తున్నారు' అంటూ కథనం ప్రచురితమైంది. అప్పట్లో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు పెట్టారు. ప్రస్తుతం ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. నాలుగు ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె వేశారు. షెడ్డూ నిర్మించారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే భానుప్రకాష్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణను తొలగించాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు సూచించారు. రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు ఆ భూమిలో మొక్కలు పెంచడానికి సమాయత్తమవుతున్నారు.



కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,298మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,690మంది దర్శించుకున్నారు. రూ.500 రాహు కేతు టిక్కెట్ల ద్వారా 2,148మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 895, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 219మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 49మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 14,938 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కిట్టూర్ రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ఫర్ గర్ల్స్ సైనిక్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 2న జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష జరుగనుందని వివరించారు. 2013 జూన్ 1 నుంచి 2015 మే 31 మధ్యకాలంలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. మేథమేటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, ప్రొఫిషియెన్సీ టెస్ట్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ అంశాలపై మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999లలో సంప్రదించాలని కోరారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ



చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, ఆంజనేయస్వామి వారికి పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈమూడు రోజులు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్జిత కల్యాణోత్సవ సేవ రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వీఆర్ వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

- సైన్స్‌సెంటర్‌లో చెకుముకి టాలెంట్ టెస్ట్

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని, మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలని తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, సైన్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి-2024 టాలెంట్ టెస్ట్ స్థానిక రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన 60 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు ఈ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. బాలాజీ, శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ దేశాభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలన్నారు. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదికను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీహరికోట స్పేస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో గూడూరు జీవీఎస్ శంకరయ్య మెమోరియల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరు వచ్చేనెల 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు చెంగయ్య, రఫీ, లక్ష్మీనారాయణ, మణికంఠ, ఫిజికల్ సైన్స్ ఫోరం మేగనాథ్, రోటరీ క్లబ్ రవికుమార్, తిరుపతి బాలోత్సవం దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలో విజేతలు

వరసిద్ధుడి సేవలో చిత్తూరు ఎంపీ



ఎంపీ దగ్గుమళ్లకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ ఆదివారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీఆర్.రాజన్, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగన్మోహన్‌కు ఎస్టీయూ సన్మానం



చిత్తూరు సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రాష్ట్ర నేతలు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ రెడ్డి, బి.మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, నేతలు మునెప్ప మొదలి, పురుషోత్తం, దేవరాజులు రెడ్డి, చంద్రన్, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

విజయ్ రాజకీయ ఆరంగేట్రానికి నగరి వాసుల మద్దతు



సామాలమ్మ గుడివద్ద తమిళగవెట్రికళగం పార్టీకి మద్దతు తెలుపుతున్న నగరివాసులు

నగరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాట సినీ నటుడు విజయ్ రాజకీయ ఆరంగేట్రానికి నగరి వాసులు తమ మద్దతు తెలుపుతూ సామాలమ్మ గుడిలో పూజలు చేశారు. నగరి టీడీపీ నాయకులు చలపతి ఆధ్వర్యంలో విజయ్ స్థాపించిన తమిళవెట్రికళగం మొదటి మహానాడు ఆదివారం జరిగిన సందర్భంగా నగరి ఒకటో వార్డు తెలుగు మహిళలు, విజయ్ అభిమానులు సామాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. రాజకీయ విజయం సాధించేలా విజయ్‌కి ఆశీర్వాదాలు ఇవ్వాలని సామాలమ్మను మొక్కారు. ఈ సందర్భంగా చలపతి మాట్లాడుతూ నగరిలో అత్యధికంగా తమిళప్రజలు, విజయ్ అభిమానులు ఉన్నారని, భవిష్యత్తులో విజయ్‌పార్టీ అభిమానుల మద్దతుతో నగరిలో తెలుగుదేశం ఓటు నిధి మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు లత, భారతి, అలిమేలు, రాధ, విజయ్ అభిమానులు గజేంద్ర, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి: యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చిత్తూరు యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో 117 జీవో రద్దుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు. 2023 జూలై నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన వేతన కమిటీ నియమించి, 33 శాతం మధ్యంతర భృతి, దీపావళికి కరువు భత్యం ప్రకటించాలని కోరారు. నవంబరు 3, 4 తేదీలలో పూతలపట్టులో జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, రాష్ట్ర కార్యదర్శి రమణ, సుధాకర్, మునిరత్నం, రెహానాబేగం పాల్గొన్నారు.





చెకుముకి పోటీల్లో మూడవస్థానం సాధించిన నగరి విద్యార్థులు



నగరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలమనేరులో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీలలో నగరి విద్యార్థులు మూడవస్థానం సాధించారని ఎంఈవో నమశ్శివాయ తెలిపారు. పుదుపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఐశ్వర్య, మోహన్‌ప్రసాద్, బాలచంద్రలు తృతీయస్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యార్థులకు గైడ్‌గా శశిరేఖ వ్యవహరించారని తెలిపారు.

రోడ్డుపైనే వారపు సంత

వాహనాలు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది



రోడ్డుపైనే నిర్వహిస్తున్న అరగొండ సంత - రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తవణంపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ అరగొండలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతను రోడ్డుపైనే నిర్వహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. మండలంలోని మేజరు పంచాయతీ అరగొండలో ప్రతి సోమవారం వారపు సంత నిర్వహిస్తారు. ఈ సంతకు పలమనేరు, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లెలతో పాటు బయట ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు కాయకూరలు తెచ్చి విక్రయిస్తుంటారు. వీరితో పాటు మండలానికి చెందిన రైతులు కూడా తమ పొలాల్లో పండించే కూరగాయలను తెచ్చి విక్రయిస్తుంటారు. పలు గ్రామాల నుంచి కొనుగోలుదారులు అధిక సంఖ్యలో సంతకు వచ్చి కాయకూరలు కొనుగోలు చేస్తారు. ఈ సంతకు వేలం నిర్వహించడం ద్వారా ప్రతి ఏటా పంచాయతీకి సుమారు రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయినా సంత నిర్వహణ కోసం సరైన స్థలం ఏర్పాటు చేయక పోవడంతో అరగొండ-గాజులపల్లె, అరగొండ-ఈచనేరికి వెళ్లే రోడ్డు పక్కనే వ్యాపారస్తులు దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత నిర్వహణ ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా ఇక్కడకు వచ్చే వ్యాపారస్తులు, రైతులు, వినియోగదారులకు తాగునీరు, బాత్‌రూమ్‌లను పంచాయతీ ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంత నిర్వహణ కోసం స్థలం ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనావుంది.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న జడ్పీటీసీ

- అట్టహాసంగా సభ్యత్వ నమోదు



టీడీపీ తీర్థం పుచ్చుకున్న జడ్పీటీసీ సుచిత్ర - పాలసముద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

ఐరాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఐరాల మండల జడ్పీటీసీ సుచిత్ర టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం మండలంలోని కలికిరిపల్లెలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని ఎమ్మెల్యే మురళీమోహన్ సమక్షంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామగ్రామాల నుంచి ప్రజలు టీడీపీలో చేరుతున్నారన్నారు. గంగారపు హరిబాబు నాయుడు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ ఎంపీపీ శాంతమ్మ, లత, స్వర్ణ, దేవాజీ, ధరణి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం ముందంజలో ఉండాలి

పాలసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదులో పాలసముద్రం మండలం ముందంజలో ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కోరారు. ఆదివారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.లక్ష చెల్లించి టీడీపీ జీవిత కాలం సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యానిర్వాహక కార్యదర్శి భీమినేనిచిట్టిబాబు నాయుడు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. మండలంలో 30 మందితో లక్ష రూపాయల సభ్యత్వం తీసుకునేటట్లు చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసు నాయుడు, శేఖర్‌రాజు,జె.విజయ్‌కుమార్, స్వామిదాస్, గుండయ్య, సాంబశివన్, అరుళ్‌నాథన్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేద్దామని ఎమ్మెల్యే థామస్ అన్నారు. వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లెలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదును వేగవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు పి.మోహన్‌మురళి, చెంగల్రాయరెడ్డి, నాయకులు రాంబాబురెడ్డి, విజయనరసింహారెడ్డి, దామోదరరెడ్డి పాల్గొన్నారు.

పెనుమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే థామస్ అన్నారు. ఆదివారం పెనుమూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం సభ్యత్వ నమోదు చేయించారు. మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, పరమేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, అశోక్, వేణు నాయుడు, సురేష్ నాయుడు, గోపాల నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నింద్ర, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ కుటుంబసభ్యులుగా చేరేందుకు రూ.100 చెల్లించి సభ్యత్వం పొందాలని టీడీపీ నాయకులు కోరారు. మండలంలోని శ్రీరామపురంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు, మనోహర్ నాయుడు, మనోజ్ యాదవ్, కాటయ్య, అప్పారావు, అభిషేక్, ప్రకాష్, వెంకటేశులు రెడ్డి, ఢిల్లీ నాయుడు, లింగయ్య పాల్గొన్నారు.

పూతలపట్టు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని ఆ పార్టీ యువనేత, ఎల్బీఐ మేనేజింగ్ డైరెక్టర్ ముత్తిరేవుల లోకేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ముత్తిరేవుల, జెట్టిపల్లి, మురకంబట్టు అగ్రహారం గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్‌లు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కృష్ణమూర్తి, రెడ్డెప్ప రెడ్డి, దయ, ప్రతిభతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరామపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు - ముత్తిరేవులలో కార్యకర్తలతో మాట్లాడుతున్న లోకేష్ రెడ్డి

టీడీపీ సీనియర్ నేత మృతి



విజయపురం, అక్టోబరు 27: మండలంలోని మహారాజపురానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నగరి నియోజకవర్గ రైతు విభాగం కన్వీనర్ డి.సుబ్రహ్మణ్యంరాజు తమ్ముడు డి.రామచంద్రరాజు(60) ఆదివారం అనారోగ్యంతో తమిళనాడులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం దహన క్రియలు స్వగ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన మృతదేహానికి చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు దశరథ రాజు, కొండూరు దాము, వెంకటేశులు యాదవ్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అంధత్వ నివారణే జైన్ సంఘం లక్ష్యం



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో అంధత్వ నివారణే జైన్ సంఘం ప్రధానలక్ష్యమని ఆ సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ అన్నారు. ఆదివారం రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల సహకారంతో జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. 124 మందికి ఉచితంగా నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన 51 మందికి జైన్ సంఘం అన్ని ఖర్చులు భరించి వైద్యం చేయించనున్నట్లు సుభాష్‌జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, ఎవంత్, కమలేష్, అమిత్‌జైన్ పాల్గొన్నారు.

మన్‌కీబాత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఆదివారం వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీ తెల్లగుండ్లపల్లెలో బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, ఢిల్లీ, సాయి, దయ, కృప, మునికృష్ణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి పూజ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం ముత్తరపల్లెలో నూతనంగా నిర్మాణం కానున్న ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, మొరార్జి యాదవ్, లక్ష్మీపతి నాయుడు, రవీ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి



లోకేశ్‌రావు (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లికి చెందిన గంజి లోకేశ్‌రావు(30) తన సొంత పనుల నిమిత్తం స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంలో ఈ నెల 25న కార్వేటినగరానికి వస్తూ రోడ్డుపై కుక్కను తప్పించబోయి ప్రమాదం జరిగింది. బైక్ వెనుక కూర్చొన్న గంజి లోకేశ్‌రావు అదుపు తప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం శనివారం రాత్రి చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



పరదేశి (ఫైల్‌ఫొటో)

యాదమరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిరెడ్డిపల్లిలో అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు... మాదిరెడ్డిపల్లికి చెందిన బిగ్గయ్య కుమారుడు పి.పరదేశి గత కొంతకాలంగా మానసిక సమస్యలతో అనారోగ్యం బారిన పడ్డాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ ఫలించక తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి, ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు యాదమరి పీహెచ్‌సీకి, అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇతడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధమవుదాం: కాంగ్రెస్

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాబోయే సంస్థాగత ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధమవుదామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, జీడీనెల్లూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రమేష్ బాబు అన్నారు. ఆదివారం కార్వేటినగరం మండలం అన్నూరులో కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఇన్‌చార్జి రాంభూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

త్రోబాల్‌లో రన్నరప్‌గా పీఈఎస్ పాఠశాల విద్యార్థులు



రన్నరప్ ట్రోఫీతో పీఈఎస్ పాఠశాల విద్యార్థులు

యాదమరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం, వేలూరులోని గ్లోబల్ స్కూల్‌లో ఫిట్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించిన త్రోబాల్ టోర్నమెంటులో పీఈఎస్ పాఠశాల విద్యార్థులు రన్నరప్ నిలిచారు. గత రెండ్రోజులుగా జరిగిన టోర్నమెంటులో 15 పాఠశాలలు పాల్గొనగా, పీఈఎస్ పాఠశాలకు చెందిన ఎల్.భావ్యశ్రీ బృందం త్రోబాల్ రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వైవీ కృష్ణబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అరవింద్ విద్యార్థులను అభినందించారు.

హామీలు నెరవేర్చడం చంద్రబాబుకే సాధ్యం

గుడిపాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు నెరవేర్చడం సీఎం చంద్రబాబుకే సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయనున్నారని చెప్పారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసినందువల్లే రాష్ట్రంలో 175 స్థానాలకు 164 స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. అందుకే కార్యకర్త బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన ఘనత మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి ఉపాధి, సంపద అంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని ప్రముఖ యోగా గురువు నరేంద్రకుమార్‌జీ అన్నారు. ఆదివారం స్థానిక విజయం విద్యాసంస్థల్లో సిద్ధి సమాధి యోగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ యోగా, మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన పలువురికి ఆయన యోగాసానాలు నేర్పించారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య గురూజీ, జగన్నాథ్ గురూజీ పాలొన్నారు.



యోగా శిక్షణనిస్తున్న నరేంద్రకుమార్‌జీ

యోగా, వాకింగ్‌తో సర్వరోగ నివారణ



పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్రతి రోజు ఉదయాస్తమానాలలో వాకింగ్, యోగా అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం గిరింపేట పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులుగా వి.కె.విశ్వనాథ్, గౌరవాధ్యక్షులుగా చిన్నబ్బ నాయుడు, ఉపాధ్యక్షులుగా మండీ సుధ, సెక్రటరీగా సుందరమూర్తి, జాయింట్ సెక్రటరీగా ప్రభాకర నాయుడు, కోశాధికారిగా రామ్మూర్తి, సభ్యులుగా ఉదయగిరి, మురుగేష్, ముత్తు, గిరిధర్, గోవర్ధన్, పూర్ణచంద్రారెడ్డి, శోభన, షణ్ముగంలచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. సామాజిక సంఘ సేవకుడు పార్థసారథి నాయుడు, వాకర్స్ యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కును విరాళంగా అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి తిరుపతికి చెందిన అమరేంద్రరావు ఆదివారం చెక్కు రూపంలో రూ.1,00,000 విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో స్వామి దర్శన భాగ్యం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లోని వాహనాలకు ఆదివారం రాత్రి ఆయుధ పూజ చేశారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరులో 'జోస్ ఆలుక్కాస్' ప్రారంభం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పలమనేరు రోడ్డు రెడ్‌క్రాస్ బిల్డింగ్ ఎదురుగా జోస్ ఆలుక్కాస్ నూతన జ్యువెలరీ షోరూమ్‌ను ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్‌తో కలిసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తూరును విద్య, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ నాణ్యమైన నగలకు కేరాఫ్ అడ్రస్ 'జోస్ ఆలుక్కాస్' అన్నారు. ఎండీలు వర్గీస్, పాల్‌జే, జాన్ ఆలుక్కాస్ మాట్లాడుతూ.. చిత్తూరులో తమ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. షోరూమ్ ప్రారంభం సందర్భంగా వినియోగదారులకు పలు రాయితీలు, పథకాలు ప్రవేశ పెట్టామని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐశ్వర్య రాజేష్, పక్కన ఎమ్మెల్యే జగన్మోహన్, షోరూమ్ నిర్వాహకులు

తగవులు తీర్చే బేలుపల్లె రచ్చబండ



బేలుపల్లెలో వున్న రచ్చబండపై కూర్చొని ఉన్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె మండలంలోని బేలుపల్లె గ్రామంలో ఉన్న రచ్చబండకు తగవులు తీర్చే బండగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇంతే కాకుండా గ్రామంలో ఎవరింట్లో పెళ్లి జరిగినా రచ్చబండ దగ్గర నలుగుపెట్టి వివాహ కార్యక్రమాలు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. చాలావరకు గ్రామంలో ఏ సమస్య వచ్చినా ఈ రచ్చబండ వద్ద కూర్చొని పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవడం జరుగుతోంది. రావి చెట్టు నీడన విశ్రాంతి తీసుకోవడానికే కాకుండా సమస్యల పరిష్కార వేదికగా ఈ రచ్చబండ గుర్తింపు పొందడం విశేషం. దుస్థితికి చేరుకున్న రచ్చబండను ఇటీవల బేలుపల్లెకు చెందిన నంగిలి కృష్ణవేణమ్మ, లక్ష్మమ్మ, రామయ్యమొదలి కుటుంబీకులు పునర్నిర్మాణం చేసి గ్రానైట్ బండలు పరిచి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు.

\- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ





ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, క్యూలైన్లలో అమ్మవారి దర్శనం కోసం వేచి వున్న భక్తులు

చౌడేపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆదివారం ఉదయాన్నే అర్చకులు అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

భక్తులపై టెండరుదారుల దాడి

ఈవో జోక్యంతో సద్దుమణిగిన వివాదం

బోయకొండలో భక్తులపై క్లీనింగ్ టెండరుదారుల అనుచరులు దాడులు చేసి గాయపరచిన ఘటన ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన సురేష్‌రెడ్డి ఆర్మీలో పనిచేస్తున్నారు. గంగమ్మ మొక్కు నిమిత్తం ఆయన తన బంధుమిత్రులతో కలిసి ఆదివారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. మొక్కుబడిగా అమ్మవారికి పొట్టేలను బలి సమర్పణ చేశారు. తర్వాత క్లీనింగ్ కోసం టెండరుదారుల నుంచి రూ.400 చెల్లించి రశీదు తీసుకున్నారు. అయితే అదనంగా మరో రూ.200 ఇవ్వాలని టెండరుదారులు డిమాండ్ చేయడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సురేష్‌రెడ్డి బంధువులు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారికి కొండకింద ఉన్న ఆలయ ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్సలు అందించారు. బాధితులు ఈ విషయమై ఈవో ఏకాంబరానికి తెలపగా ఆయన ప్రథమ చికిత్స కేంద్రం వద్దకు చేరుకుని ఇరువర్గాలను విచారించి గాయపడిన వారికి టెండరుదారుల నుంచి రూ.50వేల నష్టపరిహారం తీసిచ్చారు. ఇంతటితో ఈ విషయం సద్దుమణిగింది. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇలాంటి విషయాలతో బోయకొండ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందని భక్తులు కోరుతున్నారు.



భక్తులతో మాట్లాడుతున్న ఈవో ఏకాంబరం

కాణిపాకంలో ముగిసిన ఖోఖో పోటీలు





ప్రకాశం, ఈస్ట్ గోదావరి జట్లకు ట్రోఫీని అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో.. ప్రకాశం జట్టు ప్రథమ స్థానం, కృష్ణా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో.. ప్రథమస్థానంలో ఈస్టు గోదావరి, ద్వితీయస్థానంలో శ్రీకాకుళం జట్లు నిలిచాయి. ముగింపు సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధితో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఖోఖో చాంపియన్ షిప్ పోటీలను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ కాణిపాకంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, గిరిధర్ బాబు, శాప్ చైర్మన్ రవి నాయుడు, మణి నాయుడు, హరిబాబు నాయుడు, మధుసూదన్‌రావు, లత తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి నామాలతో గీతార్చన



ముద్రించిన వరసిద్ధుడి నామాల కార్డులను అందిస్తున్న హేమలత

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం వరసిద్ధుడి నామాలతో గీతార్చన చేసి హేమలత అనే గాయని అందరినీ భక్తి పారవశ్యంలో మునిగిపోయేలా చేసింది. ఆమె మాట్లాడుతూ స్వామిపై ఉన్న భక్తితో వరసిద్ధుడి 108 నామాలను రాశానన్నారు. అనంతరం ఈ నామాలను ముద్రించిన 1001 కార్డులను ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు అందించారు. ఆమెకు ఏఈవో వరసిద్ధుడి దర్శన భాగ్యం కల్పించారు.

శ్రీకాళహస్తిలో 1న సామూహిక కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నవంబరు 1న సామూహిక కేదార గౌరీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ మండపంలో ఉదయం 7గంటల నుంచి వ్రతం జరుగుతుందన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):బాల వివాహాన్ని ప్రగతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అడ్డుకున్నారు. బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిపించేందుకు పెద్దలు ఏర్పాట్లు చేశారు. సమాచారం తెలుసుకున్న ప్రగతి కోఆర్డినేటర్లు రాజారెడ్డి, నారాయణ మహిళా పోలీసుతో కలిసి గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

శాస్త్రీయ పద్ధతుల్లో అరటి సాగు లాభదాయకం

● ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ గోపాల్



తిరుపతి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో అరటి పంటను సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ గోపాల్ తెలిపారు. తిరుపతిలోని చీనీ, నిమ్మ పరిశోధనా స్థానంలో అఖిల భారత సమన్వయ ఫల పరిశోధనా సంస్థ, ఉద్యాన వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సీ సబ్ ప్లాన్ కింద అన్నమయ్య జిల్లాలోని ఓబులవారిపల్లె మండలానికి చెందిన ఎస్సీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, పురుగు మందులు, నీటిలో కరిగే ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో అరటి సాగు, చీడ, పీడల నివారణపై అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి, శాస్త్రవేత్తలు డాక్టర్ రంజిత్, డాక్టర్ తనూజ, డాక్టర్ కవిత, టెక్నికల్ పర్సన్ గోపి, పెద్ద ఓరంపాడు, రాళ్లచెరువు పల్లె, గోవిందపల్లె పంచాయతీలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

కార్డుదారులకు కందిపప్పు వచ్చేసింది

ఈసారి నుంచి జొన్నలు కూడా పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు నవంబరు నుంచి బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలను పంపిణీ చేయనున్నారు. అన్ని కార్డులపై కిలో రూ.67 చొప్పున కందిపప్పు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డుదారులకు పంచదార కిలో రూ.14, మిగిలినవారికి అర కిలో రూ.17 చొప్పున అందించనున్నారు. అలాగే ప్రతి కార్డుదారుడికీ మూడు కిలోల చొప్పున బియ్యం బదులు జొన్నలు పంపిణీ చేయనున్నారు. జిల్లాకు నవంబరు నెలకు సంబంధించి 8,400 టన్నుల బియ్యం, 540 టన్నుల కందిపప్పు, 300 టన్నులు పంచదార, 300 టన్నుల జొన్నలు కేటాయింపులు జరిగాయని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ఇప్పటికే 90శాతం సరుకులను చౌకదుకాణాలకు తరలించామని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోపు అన్ని దుకాణాలకు సరుకులు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అడవి పంది మృతి ఘటనలో ఒకరి అరెస్టు

తవణంపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల ఉచ్చులోపడి అడవి పంది మృతి చెందిన ఘటనలో ఒకరిని ఆదివారం అరెస్టు చేసినట్లు అటవీశాఖ డీఆర్‌వో ఆనందరెడ్డి తెలిపారు. తవణంపల్లె మండలంలోని మారేడుపల్లె గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందుల వేట కోసం కరెంటు తీగలతో ఉచ్చు ఏర్పాటు చేశారు. ఇందులో చిక్కుకుని శనివారం వేకువ జామున అడవి పంది మృతి చెందింది. దీనిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనికి కారకుడైన దిగువమారేడుపల్లెకు చెందిన సురేంద్ర(45)ను అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

ప్రభుత్వ మైనార్టీ ఐటీఐని పట్టించుకోండి

సాంకేతిక కోర్సులున్నా బోధకులు కరువు ● నిరుపయోగంగా విలువైన పరికరాలు ● సీట్లన్నీ విద్యార్థులతో ఫుల్ ..శిక్షణ మాత్రం నిల్



పుంగనూరు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ, నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు, ఫ్యాషన్ డిజైన్ యంత్రాలు

పుంగనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు సాంకేతిక రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన దోహదపడేలా పుంగనూరులో ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేసినా పలు సమస్యలతో ప్రభుత్వ ఆశయం నెరవేరలేదు. 1998లో ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ మంజూరు కాగా స్థానిక పలమనేరు రోడ్డులోని గూడూరుపల్లె వద్ద 2010లో రూ.62.50లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించగా నాటి అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఐటీఐలో మెకానిక్ డీజల్ కోర్సులో 24 మంది, వెల్డర్‌లో 20 మంది, ఫ్యాషన్ డిజైన్స్ టెక్నాలజీలో రెండు యూనిట్లకు 40 మంది, రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషన్ కోర్సులో 20మంది, ఫిట్టర్‌లో 20 మంది, డ్రాఫ్ట్స్‌మెన్స్ సివిల్‌లో 24మంది, మోటర్ మెకానికల్ (ఎంఎంవీ)లో 20 మంది శిక్షణ పొందేలా ప్రభుత్వం సీట్లు మంజూరు చేసింది. పదోతరగతి, టెన్త్ ఫెయిల్, ఇంటర్మీడియట్ అర్హతతో సీట్లు కేటాయిస్తుండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఐటీఐలో విద్యార్థులు మాత్రం అడ్మిషన్లు పొందుతున్నారు కానీ ఇక్కడ అధ్యాపకులులేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సుల కు 30కంప్యూటర్లు ఏర్పాటు చేసినా ఫ్యాకల్టీ లేక కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. కాలేజీ ప్రారంభంలో మంజూరైన పోస్టులు తప్ప కొత్త పోస్టులు మంజూరు కాలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఐటీఐలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. 2022 అక్టోబరు 21న నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. కానీ ఏడాది మాత్రమే స్కిల్ హబ్ నడిచి తర్వాత దాని ఊసేలేదు. కుట్టు మిషన్లు ఇస్తామని ప్రకటించడంతో అప్పట్లో అధిక సంఖ్యలో ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ కోర్సులో మహిళలు శిక్షణ పొందినా ప్రభుత్వం మెషీన్లు ఇవ్వలేదు. అన్ని విభాగాల్లో విలువైన పరికరాలున్నా ఫ్యాకల్టీ లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. డీజల్ మెకానిక్‌లో పనిచేసే అధ్యాపకుడు రెండేళ్ల క్రితం, ఫిట్టర్‌లో ఓ అధ్యాపకుడు ఈ ఏడాది చనిపోగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ లో ఇద్దరు అధ్యాపకులే ఉన్నారు. దాదాపు రెండేళ్లుగా ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పుంగనూరు, తంబళ్లపల్లె కాలేజీలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. కాలేజీలో నలుగురు సీనియర్ అసిస్టెంట్లకు గానూ ఒక్కరే ఉండగా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐదుగురు డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్లకు నాలుగు పోస్టులు ఖాళీ గా ఉన్నాయి. రెండు అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు, వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఐటీఐ కాలేజీ సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపానని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కాలేజీ పట్టణానికి దూరంగా ఉండగా ప్రహరీలేదు. తాగునీటి సమస్యతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతూ ట్యాంకుల ద్వారా నీరు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పుంగనూరుల మైనార్టీ ఐటీఐ కాలేజీలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటినుంచి అటల్ టింకరింగ్ వర్క్‌షాప్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి బుధవారం వరకు రీజినల్ స్థాయి అటల్ టింకరింగ్ ల్యాబ్, స్పైక్ వర్క్‌షాప్ డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడ్రోజులపాటు జిల్లాలోని టీచర్లకు రెసిడెన్షియల్ విధానంలో శాంతిపురం మండలం పరమహంస యోగాలయ విద్యానంద పాఠశాల ఆవరణలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రీజినల్‌లోని అన్నమయ్య, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, శ్రీసత్యసాయి, నెల్లూరు, తిరుపతి, కడప, నంద్యాల, ప్రకాశం జిల్లాల నుంచి 50 మంది ఉపాధ్యాయులు పాల్గొని, కొత్త నమూనాలు తయారు చేయనున్నట్లు వివరించారు. ఈ మోడల్స్‌ను ఆయా జిల్లాలో టీచర్లకు, విద్యార్థులకు ప్రదర్శన, వివరించనున్నట్లు తెలియజేశారు.

సామాన్యుల స్థితిగతులను మార్చడమే లక్ష్యం

\- పద్మశ్రీ అవార్డు గ్రహీత అనితారెడ్డి



బహుమతులు పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ట్రస్టీ అనితారెడ్డి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మురికివాడల్లో నివసిస్తున్న సామాన్యుల స్థితిగతులను మార్చడమే లక్ష్యంగా ద్వారకనాథరెడ్డి రమణార్పణం ట్రస్టు పని చేస్తుందని ట్రస్టీ, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనితారెడ్డి అన్నారు. న్యూట్రిన్ గ్రూప్ వ్యవస్థాపకుడు ద్వారకనాథరెడ్డి శత జయంతి వేడుకలను ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన 700 మంది విద్యార్థులకు దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. అనితారెడ్డి మాట్లాడుతూ ద్వారకనాథరెడ్డి స్ఫూర్తితో పేద పిల్లలను ట్రస్టు ఆధ్వర్యంలో ఉన్నత విద్యను చదివిస్తున్నట్లు చెప్పారు. జిల్లాతో తమ బంధం విడదీయరానిదన్నారు. ట్రిక్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మెడలో తాళిబొట్టు లాక్కెళ్లిన దొంగలు



పారిపోతున్న దొంగల సీసీ ఫుటేజ్

ఐరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ మెడలో బంగారు తాళిబొట్టును లాక్కెళ్లారు. ఐరాల ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండల శివారు ప్రాంతమైన జీ.గొల్లపల్లెకు చెందిన మునిరత్నం భార్య నాగరత్న పాటూరు సంతగేటుకు వెళ్లేందుకు శనివారం సాయంత్రం రోడ్డుపైకి వచ్చి బస్సు కోసం వేచి ఉంది. ఆ సమయంలో పూతలపట్టు వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమెను ఏదో అడ్రస్ అడిగారు. ఇంతలో వాహనంలో వెనుక వైపు కూర్చొన్న వ్యక్తి ఆమె మెడలోని 36 గ్రాముల బంగారు తాళి బొట్టును లాక్కొని దామలచెరువు వైపు పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, అక్టోబరు 27: కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలనుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి, ఆయా ప్రభుత్వ విభాగాధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
Wanted Tele Callers/Marketing Officers / Team Leaders, Salary Rs. 20,000/- pm + Incentives upto Rs.25,000/-, RKC Group: 8801501376, 8801502343.
AJT - 4404

WANTED
Telesales Persons from Tirupati, Females work from home,willing to work hard required for a Temporary Project. Contact : 85009 60577
AJT - 4422

WANTED
బోశ్ హాస్పిటల్, కొర్లగుంట, తిరుపతి నందు పనిచేయుటకు వార్డు బాయ్స్ కావలెను. నైట్ డ్యూటీ సెక్యూరిటీ గార్డ్, వంట మనిషి (ఆడ) కావలెను. సెల్ : 99494 23941, 81254 62933.
AJT - 4431

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198455

CHANGE OF NAME
I, D. Thulasi Rani Spouse of late K. Neerajakshulu Naidu Rank Naik No: 6378058N Resident of D. No 6-94,Rajakula colony, Pudipatla Village & Post Tirupati Rural, Tirupati Dt, Andhra Pradesh, India have changed my name from TULSI RANI (Old Name) to D.THULASI RANI (New Name) D.O.B 16-05-1975, That both names pertain to one and the same person.
AJT - 4433

PLOTS FOR SALE
36 months EMI Plots for Sale. Near Yerpedu IIT, IISER & IT Hub, Final Approved & Spot Registration. RKC Developers : 88015 01376.
AJT - 4405

PLOTS FOR SALE
రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీకి ఎదురుగా దాలర్స్ 15 లో 122 (55 అంకణాలు) ఈస్ట్ ఫేసింగ్, తుడా అప్రూవల్ గల ప్లాట్ అమ్మబడును. 1 అంకణం 78000 రూ మాత్రమే . సెల్: 99660 66111
AJT - 4426

PLOTS FOR SALE
తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర TCL కంపెనీకి ఎదురుగా తక్కువ బడ్జెట్కే తుడా ఫైనల్ అప్రూవల్ ఫ్లాట్స్ అందుబాటులో కలవు. 82470 75857, 94943 92069
AJT - 4429

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి